# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 06-05-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- దేవదాయ శాఖపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించారు.
- రైతు సహాయ కేంద్రాల ద్వారా తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.
- రాష్ట్రవ్యాప్తంగా ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఏపీ ఐసెట్2025 పరీక్ష రేపు జరగనుంది.
- తిరుమలలో రేపటి నుండి మూడు రోజుల పాటూ శ్రీ పద్మావతి పరిణయోత్సవాలు జరగనున్నాయి.

==========================

దేవదాయ శాఖలో ఖాళీగా ఉన్న 137 ఉద్యోగాల భర్తీకి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆమోదం తెలిపారు. దేవదాయ శాఖపై ముఖ్యమంత్రి ఈరోజు ఉదయం రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ సహా గ్రేడ్ 1, గ్రేడ్ 3 ఈవో పోస్టులు సైతం ఖాళీలు ఉన్నాయని, వాటిని భర్తీ చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే మరో 200 మంది వైదిక సిబ్బంది నియామకాలను కూడా చేపట్టాలన్నారు. నూతనంగా 16 ఆలయాల్లో నిత్యాన్నదాన పథకం అమలు చేయాలని ఆదేశించారు. అదే విధంగా 23 ప్రధాన ఆలయాలకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని, భక్తుల మనోభావాలు దెబ్బ తినకుండా కార్యక్రమాలు చేపట్టాలని ఉన్నతాధికారులకు ఆయన సూచించారు. దేవాలయ భూముల్లో శాఖాహార హోటళ్లకు మాత్రమే అనుమతి ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇక ఆగమశాస్త్రం ప్రకారమే ఆలయాల అభివృద్ధి పనులు చేపడతామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ రోజు జరిగిన ఈ సమీక్ష సమావేశంలో రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

==========================

ధాన్యం కొనుగోలు విధానాన్ని పారదర్శకంగా ప్రభుత్వం అమలు చేస్తోందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఈరోజు మంత్రి ధాన్యం సేకరణపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... రైతులు పండించిన ప్రతీ ధాన్యపు గింజను కొనుగోలు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటివరకు రబీ, ఖరీఫ్ సీజన్లలో మొత్తం 48 లక్షల 90 వేల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో 11 వేల 400 కోట్ల రూపాయలను జమన్నారు. 356 రైతు సహాయ కేంద్రాల ద్వారా తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ వివరిస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

============================

రాష్ట్ర వ్యాప్తంగా ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే సంయుక్త ప్రవేశ పరీక్ష ఏపీ ఐసెట్ 2025 రేపు జరగనుందని ఏపీ ఐసెట్ చైర్మన్, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.పి. రాజశేఖర్ తెలిపారు. ఈరోజు ఏయూ పాలకమండలి సమావేశ మందిరంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనంజయరావు, సెట్ కన్వీనర్ ఆచార్య ఎం.శశిలతో కలిసి జి.పి రాజశేఖర్ పరీక్ష వివరాలను వెల్లడించారు. ఈ పరీక్షకు ఆంధ్రప్రదేశ్ తో పాటు హైదరాబాద్‌లో 94 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ పరీక్షకు 37 వేల 572 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని.. రేపు రెండు సెషన్స్ లో పరీక్ష నిర్వహిస్తామని ఉపకులపతి జి.పి రాజశేఖర్ వివరిస్తూ...

(వాయిస్ 40 సెకన్లు)

============================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం బేబీ కిట్ పథకాన్ని పునరుద్ధరించింది. నవజాత శిశువుల ఆరోగ్యం కోసం 11 వస్తువులతో కూడిన బేబీ కిట్‌ను ప్రభుత్వం పంపిణీ చేయనుంది. దోమల తెరతో కూడిన బెడ్, వాటర్ ప్రూఫ్ కాట్ షీట్, బేబీ డ్రెస్, వాషబుల్ నాప్కిన్స్, టవల్, బేబీ పౌడర్, బేబీ షాంపూ, బేబీ ఆయిల్, బేబీ సోప్, సోప్ బాక్స్, బేబీ రాటిల్ టాయ్ లు ఈ కిట్ లో ఉంటాయి.

విరామం

============================

భారత్, పాకిస్తాన్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. యుద్ధ సన్నద్ధతపై కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఈరోజు కీలక సమీక్షా సమావేశం నిర్వహించింది. హోంశాఖ కార్యదర్శి గోవింద్‌మోహన్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో సుమారు 244 జిల్లాల్లో మాక్ డ్రిల్స్ కు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులు సమీక్షించారు. ఈ సమీక్షకు సివిల్ డిఫెన్స్ డీజీ, ఎన్డీఆర్ఎఫ్ డీజీ సహా పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. కాగా రేపు అన్ని రాష్ట్రాల్లో సివిల్ మాక్ డ్రిల్స్ నిర్వహించాలని కేంద్రప్రభుత్వం ఆదేశించింది. మాక్‌డ్రిల్స్ నిర్వహించే ప్రాంతాలను 3 కేటగిరీలుగా విభజించారు. మొదటి కేటగిరీలో ఢిల్లీ, ముంబయి, సూరత్, వడోదర, కక్రాపూర్, తారాపూర్, తాల్చేర్, కోట, రావత్, చెన్నై, కల్పక్కం, నరోరా జిల్లాలు ఉన్నాయి. ఇక రెండో జాబితాలో హైదరాబాద్, విశాఖపట్నం సహా 201 జిల్లాలు ఉన్నాయి. ఇక పాకిస్థాన్‌తో సరిహద్దు ఉన్నరాష్ట్రాలు గుజరాత్, పంజాబ్, హరియాణా, జమ్ముకశ్మీర్‌లకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సూచనలు జారీ చేసింది.

============================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో పూర్వ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ఆవిష్కరించారు. జూలై 27న అబ్దుల్ కలాం వర్ధంతి రోజున ఈ విగ్రహాలను రాష్ట్రంలోని మొత్తం 13 ఉమ్మడి జిల్లాల్లో ఆవిష్కరించేలా వైబ్రాంట్స్ ఆఫ్ కలాం సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 25 విగ్రహాలను ఆవిష్కరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆ సంస్థ ప్రతినిధి విజయ్ తెలిపారు. సుప్రీం కోర్టు

మార్గదర్శకాలకు అనుగుణంగా 20 అడుగుల అబ్దుల్ కలాం విగ్రహాలను ఏర్పాటు చేస్తామని ఆయన వెల్లడించారు. యువతకు స్ఫూర్తిని ఇచ్చేలా ఈ విగ్రహాల ఏర్పాటు ఉంటుందని పేర్కొన్నారు.

============================

చిత్తూరు జిల్లాలో భూగర్భ జలాల పెంపునకు ఉద్యమ స్థాయిలో చర్యలు చేపడుతున్నామన్నామని రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. మామిడి పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా జిల్లా యంత్రాంగంతో కలసి కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో పర్యటించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... పి.జి.ఆర్.ఎస్.లో అందే రెవెన్యూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర స్థాయి నుండి జిల్లా స్థాయి అధికారులు కృషి చేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో చిత్తూరు జిల్లాను అగ్రగామిగా నిలపాలని అధికారులను ఆదేశించామన్నారు

============================

తిరుమలలో రేపటి నుండి మూడు రోజుల పాటూ శ్రీ పద్మావతి పరిణయోత్సవాలు జరగనున్నాయి. ఈ వేడుకలు నారాయనగిరి ఉద్యానవనంలోని ప్రత్యేక మండపంలో జరుగుతాయి. మొదటి రోజు శ్రీ మలయప్ప స్వామి వారు గజవాహనంపైన రెండవ రోజు అశ్వవాహనంపైన మూడవ రోజు గరుడ వాహనంపైన ఉభయ నాంచారులు ప్రత్యేక పల్లకిలో వేంచేపు చేస్తారు. ఈ మూడు రోజుల పాటూ ఆర్జిత బ్రహ్మోత్సవం సహస్ర దీపాలంకరణ సేవలు రద్దు చేయబడ్డాయి.

============================

ప్రజారోగ్యం దృష్ట్యా ప్రతీ ఆరోగ్య కార్యక్రమానికి సంబంధించిన సర్వేలు పక్కాగా చేపట్టాలని వైద్యారోగ్యశాఖ పార్వతీపురం మన్యం జిల్లా కార్యక్రమ అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు స్పష్టం చేశారు. ఈరోజు జిల్లాలోని మక్కువ, శంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించిన ఆశా-డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామాల్లో ఆరోగ్య సేవలు అందుతున్న తీరు, ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్షించి ప్రగతి నివేదికలను పరిశీలించారు.

============================

దక్షిణ తెలంగాణ మరియు దాని పరిసర ప్రాంతాలలో ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 900 మీటర్ల ఎత్తులో కొనసాగుతోందని అమరావతిలోని భారత భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాబోయే రెండు రోజులు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు రాష్ట్రంలో కొన్ని చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ శాఖాధికారి వెల్లడిస్తూ....

(వాయిస్ 40 సెకన్లు)

============================
============================